నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 8 ఏప్రిల్ 2025 | KARIMNAGAR

## జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో
# జ్యోతిష్మతి విద్యార్థుల సత్తా



విద్యార్థులకు స్వీట్ తినిపిస్తున్న కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్‌రూరల్, ఏప్రిల్ 7 : జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాల విద్యార్థులు అజిత్, అక్షిత్, రమేశ్ జాతీయ స్థాయిలో సత్తాచాటారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎస్‌ఆర్‌ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, కాహర్ట్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో 92 జట్లతో పోటీపడి ప్రథమ స్థానంలో నిలిచారు. పంట వ్యాధులను గుర్తించడానికి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రాజెక్ట్ ఆల్ క్రాప్ కేర్ అనే ఏ1-ఆధారిత పరిష్కారాన్ని రూపొందించారు. విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనకు ₹10వేల నగదు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అభినందించారు.

# ఫీజు బకాయిల విడుదలలో నిర్లక్ష్యమెందుకు?

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 7 : సీఎం రేవంత్‌రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నా విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదలలో ఎందుకంత నిర్లక్ష్యమని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ధ్వజమెత్తారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడవద్దని హితవుపలికారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వద్ద విద్యా శాఖ పెట్టుకుని హెచ్‌సీయూలో 400 ఎకరాల భూములను వేలం ద్వారా అమ్మడానికి ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. భూములు అమ్మడానికే ముఖ్యమంత్రి తన వద్ద విద్యాశాఖను పెట్టుకున్నారని ఆరోపించారు. ఓయూలో అప్రజాస్వామిక ఆంక్షల సర్క్యులర్‌ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి అధికారంలో రావడానికి విద్యార్థులు సహకరించారన్న విషయాన్ని మరువవద్దని, 16 నెలల పాలనలో ఫీజు బకాయిలు విడుదల చేయడంలో ఎందుకంత నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని, వేసవిలోనే ఇంటర్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయని, విద్యాశాఖ అధికారులు అండదండలతోనే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్ రెడ్డి, అశోక్, పవన్, వినయ్‌రెడ్డి, రాజేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు ఐక్యవేదిక సంఘం నాయకులు

# మామిడి రైతుకు భరోసా కల్పించాలి

రైతుఐక్య వేదిక రాష్ట్ర నాయకులు

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 7 : జగిత్యాల మ్యాంగో మార్కెట్‌లో రైతులకు దళారుల బెడద తప్పించాలని, బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేసి భరోసా కల్పించాలని జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక నాయకులు వేడుకున్నారు. రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నాణ్యతలో జాతీయ స్థాయిలో పేరు గాంచిన జగిత్యాల మామిడిని బహిరంగ వేలం వేసి కొనాలని రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా రైతు ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ, స్థానిక వ్యాపారులతో పాటు ముంబై, ఢిల్లీ ఫ్రూట్ మార్కెట్ వ్యాపారులు నెల ముందు నుంచే జగిత్యాలలో అడ్డా వేస్తున్నారని, రేటు తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. మామిడి కాయ చెట్టుమీద ఉన్నప్పుడు ఒక ధర, దింపాక మరో ధర ఉంటుందని, ఇలా చేయడం ద్వారా రైతులు నష్టపోతున్నారని వాపోయారు.

# డేటా ఎంట్రీ డబ్బులేవీ?

ప్రజాపాలన డాటా ఎంట్రీ ఆపరేటర్ల ఆవేదన

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 7 : ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా తమకు ప్రభుత్వం ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదని డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌కు వచ్చి ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించి మొరపెట్టుకున్నారు. ప్రజాపాలనలో భాగంగా చేసిన సర్వేకు సంబంధించి కుటుంబ సభ్యుల వివరాలను తాము ఎంట్రీ చేశామని, పదిహేను రోజులపాటు కష్టపడి పనిచేశామని, అయినా డబ్బులు ఇవ్వలేదని వాపోయారు. గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సంప్రదించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. తమకు ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బులు ఇప్పించాలని వేడుకున్నారు.



జగిత్యాల కలెక్టరేట్ ఆవరణలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు



ఎంపీడీవో క్రిష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

# రేషన్ కార్డుల సర్వే చేయలేం

పంచాయతీ కార్యదర్శులు

శంకరపట్నం, ఏప్రిల్ 7 : 'ఇప్పటికే ఊపిరి సలపని పని భారంతో సతమతమవుతున్నం. వీటికి తోడు మళ్లీ మమ్మల్ని రేషన్ కార్డుల సర్వే చేయమంటే ఎలా..? మావల్ల కాదు' అని పంచాయతీ కార్యదర్శులు తేల్చి చెబుతున్నారు. సోమవారం శంకరపట్నం ఎంపీడీవో క్రిష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి, తమ గోడును వెల్లబోసుకున్నారు. రేషన్ కార్డుల సర్వే చేయాలని మండలంలోని 15 మంది కార్యదర్శులకు తహసీల్దార్ భాస్కర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఇప్పటికే శాఖాపరమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నామని, సర్వే అంటే తమకు అదనపు భారం అవుతుందని వాపోయారు. తమపై ఇతర శాఖల పనిని మోపడం సరికాదని, ఈ అదనపు సర్వే పనుల నుంచి తమను తప్పించాలని విజ్ఞప్తి చేశారు.



కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో హుజూరాబాద్ నియోజకవర్గ దళితబంధు లబ్ధిదారులు

- కరీంనగర్ తరలివచ్చిన వంద మంది హుజూరాబాద్ నియోజకవర్గ లబ్ధిదారులు
- ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతి
- షరతుల్లేకుండా రెండో విడుత నిధులు గ్రౌండింగ్ చేయాలని వేడుకోలు

# దళితబంధు కోసం కలెక్టరేట్‌కు..

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 7 : ఎలాంటి షరతుల్లేకుండా దళితబంధు రెండో విడుత నిధులు గ్రౌండింగ్ చేపట్టాలని కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ దళితబంధు లబ్ధిదారులు డిమాండ్ చేశారు. దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వంద మందికి పైగా లబ్ధిదారులు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మొరపెట్టుకున్నారు. గ్రౌండింగ్ పేర కాలయాపన చేయద్దని విజ్ఞప్తి చేశారు. వరుస ఎన్నికలతో జాప్యం జరుగుతున్నదని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలైతే మళ్లీ ఎన్నికల కోడ్ వస్తుందని వాపోయారు. నిధుల కోసం కళ్లలో వత్తులేసుకొని వేచి చూస్తున్నామని ఆవేదన చెందారు. మొదటి విడుత స్థాపించిన యూనిట్లపై విచారణ జరుపుతున్న తీరు, రెండో విడుత గ్రౌండింగ్ వ్యవహారంపై అయోమయం నెలకొన్నదని చెప్పారు. అధికారులు స్పందించి ఒక ప్రకటన విడుదల చేయాలని, సత్వరమే రెండో విడుత గ్రౌండింగ్ చేయాలని వేడుకున్నారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ దళితబంధు పథకం బాధ్యతల్లో ఉన్న అధికారిని పిలిచి, లబ్ధిదారుల డిమాండ్లు పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో దళితబంధు సాధన సమితి కన్వీనర్ సురేశ్ మాట్లాడారు. 2021లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో ₹50 వేల నుంచి ₹9.90 లక్షల వరకు దళితబంధు సాయం పొందాల్సిన లబ్ధిదారులు 9 వేల పైచిలుకు ఉన్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా లబ్ధిదారుల ఖాతాలు ఫ్రీజింగ్ చేశారని, ఎన్నికలు ముగిసినా ఎత్తేయకపోవడంతో 13 నెలలుగా పోరాటం చేశామని, దాని ఫలితంగా జనవరి 27న రెండో విడుత నిధుల విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని చెప్పారు. ఆ సమయంలో శాసనమండలి ఎన్నికల కోడ్ రావడంతో మళ్లీ ఆలస్యం జరిగిందని వాపోయారు. కోడ్ ఎత్తేసిన అనంతరం గత నెల 10న కలెక్టర్‌ను కలిసి నిధుల విడుదలపై వేడుకోగా, మొదటి విడుత యూనిట్ల గ్రౌండింగ్‌పై విచారణ జరుపుతామంటూ ప్రకటించారని, ఇప్పటివరకు ఎలాంటి విచారణ చేపట్టలేదని, రెండో విడుత విడుదలపై అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. మొదటి విడుత లబ్ధిదారులకు పూర్తిగా చెల్లింపులు చేయకపోవడంతో ప్రారంభించిన యూనిట్ల గదుల అద్దె చెల్లించలేని పరిస్థితుల్లో ఖాళీ చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే మళ్లీ కోడ్ వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## సూరంపేట అడవుల్లో
# పెద్దపులి మృతి?

- దూడ మాంసంలో క్రిమిసంహారక మందు పెట్టి చంపినట్టు ప్రచారం
- సోషల్ మీడియాలో వైరల్
- ఫేక్ అని తేల్చిన అటవీ శాఖ అధికారులు

కొడిమ్యాల, ఏప్రిల్ 7 : జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం సూరంపేట అడవుల్లో పెద్దపులి మృతి చెందినట్టు వైరల్ అవుతున్నది. రెండు నెలల క్రితం మృతి చెందిందని గొర్లకాపరులు చెబుతున్నట్టు ప్రచారం జరుగుతుండగా, అటవీ శాఖ యంత్రాంగం మాత్రం అదంతా ఫేక్ అని చెబుతున్నది. సూరంపేట గ్రామ శివారులోని దట్టమైన అటవీ ప్రాంతంలో రెండు నెలలుగా పెద్దపులి సంచరిస్తున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు కొడిమ్యాల మండలంలోని ఏడు అటవీ గ్రామాలలో డప్పు చాటింపులు, ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేశారు. అయితే రెండు నెలలకు ముందు అంటే జనవరి చివరి వారంలో సూరంపేట శివారులోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఉన్న ఆవు దూడను పులి చంపి తిన్నదని, ఆ తర్వాత సగం తిన్న దూడ మాంసంలో ఆవు దూడ యజమాని క్రిమిసంహారక మందు కలిపాడని, పెద్దపులి రెండో రోజు వచ్చి ఆ మాంసాన్ని తిని మృతి చెందిందనే ప్రచారం జోరుగా సాగుతున్నది. ఈ విషయాన్ని గొర్లకాపరులు చూసినట్టు, పులి మృతికి సంబంధించిన ఓ వీడియో, ఫొటో కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఈ విషయమై అటవీ శాఖ ఫారెస్ట్ రేంజ్ అధికారి మోహినొద్దీన్ సంప్రదించగా.. తమ వరకు కూడా వదంతులు రావడంతో సూరంపేట, గంగారాంతాండ గ్రామాల అడవుల్లో గస్తీ నిర్వహించామని చెప్పారు. 15రోజుల క్రితం డీఎఫ్‌వో కూడా వచ్చి సూరంపేట అడవుల్లో విచారణ జరిపారని తెలిపారు. అయితే జరుగుతున్న ప్రచారం అంతా ఫేక్ అని విచారణలో తేలిందని స్పష్టం చేశారు.

# రజతోత్సవ సభకు తరలిరండి

రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, ఏప్రిల్ 7: వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే, పార్టీ కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. గోదావరిఖనిలో ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటే లక్ష్యంగా బీఆర్ఎస్ టీఆర్ఎస్ ఆవిర్భావించిందని, అనుకున్న లక్షాన్ని చేరుకొని రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తు చేశారు. నేడు పార్టీ ఆవిర్భవించి 25ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 27న రజతోత్సవ మహాసభ ఏర్పాటు చేశామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, దేశంలోనే ఆదర్శంగా నిలిపిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఈ సభలో భవిష్యత్తుపై దిశానిర్దేశం చేస్తారన్నారు. రామగుండం నియోకవర్గంలోని ఉద్యమకారులు, బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, సకల జనులు ఈ రజతోత్సవ సభకు తరలిరావాలని, మరోసారి మన తెలంగాణ ఉద్యమ చైతన్యం నింపాలని ఆయన కోరారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు కుమ్మరి శ్రీనివాస్, తోకల రమేశ్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

# పొలం తడిపేందుకు అష్టకష్టాలు



కరీంనగర్, (నమస్తే తెలంగాణ) ఏప్రిల్ 7 : రోడ్డుపై ఊడిపోయిన నీటి పైపు వద్ద కనిపిస్తున్న ఈ రైతు పేరు జెల్ల కుమార్. చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లికి చెందిన ఆయన, సొంత ఎకరం భూమితోపాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని వరి వేశాడు. కౌలుకు తీసుకున్న బావి అడుగంటింది. దాంతో తన అన్నతో పొత్తున్న మరో బావి నుంచి కౌలు భూమిలో వేసిన పంటకు నీళ్లు పెట్టేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు. గాగిరెడ్డిపల్లి నుంచి సుందరగిరి వెళ్లే రోడ్డుకు ఒక వైపు సొంత పొలం, మరో వైపు కౌలు పొలం ఉండగా, వాహనాలు వెళ్లినప్పుడల్లా పైపులు ఊడి పోతున్నాయి. పైపు సరి చేసేలోపే బావిలో నీళ్లు అడుగంటుతున్నాయి. ప్రతి రోజూ ఇదే పరిస్థితి! కుమారే కాదు, ఇదే గ్రామంలో మరికొందరు రైతులు నీళ్లున్న బావుల రైతుల నుంచి కొనుగోలు చేసుకొని పంటలను కాపాడుకునేందుకు తండ్లాడుతున్నారు. పొంటెకో రైతు చొప్పున నీళ్లు పెట్టుకుని పొలాలు పారించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా, ఒక పక్క తడుపుతుంటే మరో పక్క ఎండిపోతుండడంతో కంటతడి పెడుతున్నారు. కుమార్‌లాగే చాలా మంది రైతులు అదనంగా పైపులు తెచ్చుకొని మడిమడికీ సాపుకొని పంటలకు నీళ్లు పెట్టుకుంటున్నారు. గౌరవెల్లి నుంచి వచ్చే డీ-4 ప్రధాన కాలువ, దాని ఉప కాలువలు పూర్తయితేనే తమ సాగునీటి కష్టాలు తొలగుతాయని ఈ ప్రాంత రైతులు స్పష్టం చేస్తున్నారు. పోయిన యాసంగి నుంచి తీవ్రమైన సాగునీటి సమస్యకు అప్పుడే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని చెబుతున్నారు.

## కాంగ్రెస్ పాలనలో
# నేతన్న ఆగం

- మళ్లీ ఆత్మహత్యలు పునరావృతం
- కూలీ రేట్లు పెంచకుండా నిర్లక్ష్యం
- బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ధ్వజం



సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో నేత కార్మికులకు మద్దతు ప్రకటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో నేతన్నల బతుకులు ఆగమవుతున్నాయని బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాది పొద్దు నిరంతరం పనికల్పిస్తామని చెప్పిన నేతలు పత్తాలేకుండా పోయారంటూ ధ్వజమెత్తారు. ఏదో పని కల్పిస్తున్నట్టు చీరెల ఆర్డర్లు ఇచ్చి కూలీ రేట్లు నిర్ణయించక పోవడం నేతన్నలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఇస్తున్న చీరెల తయారీకి కూలీ రేట్లు నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ నేతన్నలు సోమవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో 24 గంటల నిరాహార దీక్ష చేయగా, ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. శిబిరంలో కూర్చున్న నేతకార్మికులు, సీఐటీయూ నాయకులకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. 2014కు ముందు కూడా కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ పెను సంక్షోభంలో కూరుకుపోయి పెద్ద ఎత్తున నేత కార్మికులు ఆకలి చావులు, ఆత్మహత్యలకు గురయ్యారని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతన్నల ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని, బతుకమ్మ చీరెలతో బతుకులకు భరోసా కల్పించారని కొనియాడారు. నెలకు రూ.20 వేల కూలి వచ్చేలా కేసీఆర్ ప్రభుత్వం రూ.కోట్లలో ఆర్డర్లు ఇచ్చి చేయూత నిచ్చిందని చెప్పారు. పెట్టుబడి దారులను ప్రోత్సహించే విధంగా యారన్ సబ్సిడీ ఇచ్చి, పదిశాతం కార్మికులకే చెల్లించిందన్నారు. నేతన్నకు బీమా, త్రిఫ్ట్, 50 ఏళ్లకే పింఛన్లు ఇలా దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి నేతన్నల కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. పదేళ్ల పాటు సంతోషంగా గడిపిన నేతన్నల కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో తిరిగి రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. చీరెల తయారీ ఆర్డర్లు ఇచ్చిన ప్రభుత్వం కార్మికుల కూలి నిర్ణయించకుండా ఆసాములకు, యజమానులకు వదిలిపెట్టి ఇద్దరి మధ్య సమస్యను సృష్టించిందని ధ్వజమెత్తారు. సాంచాలు సిరిసిల్లలో ఉంటే యారన్ బ్యాంకు వేములవాడలో పెట్టి ఎవరిని ఉద్ధరించడానికంటూ మండి పడ్డారు. సర్కారు ఇచ్చే నూలుకు రెట్టింపు చార్జీలు రవాణాకే ఖర్చవుతున్నాయని, ఇదా మీ ప్రభుత్వ పనితమనంటూ ధ్వజమెత్తారు. నేతన్నల సమస్యలను వెంటనే పరిష్కరించి సమ్మె, దీక్షలను విరమింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మాజీ కౌన్సిలర్లు దార్ల సందీప్, అడ్డగట్ల మురళి, అన్నారపు శ్రీనివాస్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, కొండ శంకర్, సీఐటీయూ నాయకులు మూషం రమేశ్, కోడం రమణ, మరమగ్గాల కార్మికులు పాల్గొన్నారు.

## కూలీ రేట్ల కోసం నేతన్న 24గంటల దీక్ష

ప్రభుత్వం ఇస్తున్న చీరెల తయారీకి కూలీ రేట్లు నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల నేత కార్మికులు సమ్మె కొనసాగిస్తూనే ఉన్నారు. నిరవధిక దీక్ష సోమవారం ఏడో రోజుకు చేరగా, స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో 24 గంటల నేతన్న దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరాన్ని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ ప్రారంభించగా, బీఆర్ఎస్, సీపీఎం పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. కూలీ రేట్ల కోసం ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తమపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. తమ సమస్యను పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. దీక్షా శిబిరంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్ కార్మిక సంఘం అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, వైపని అసోసియేషన్ అధ్యక్షుడు కుమ్మరికుంట్ల కిషన్, నక్కదేవదాస్, ఉడుత రవి, ఎలిగేటి దేవదాస్, బూట్ల వెంకటేశ్వర్లు, మేకల బాలరాజు, అవదూత హరిదాస్, బాస శ్రీధర్, కస్తూరి సతీశ్, గుండు రమేశ్ పాల్గొన్నారు.

# ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదానం

కరీంనగర్ విద్యానగర్, ఏప్రిల్ 7 : వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ, ఫిజీషియన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని కశ్మీర్‌గడ్డ ఐఎంఏహాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. నిరుపేదలకు అవసరమయ్యేలా ప్రభుత్వ దవాఖాన బ్లడ్ బ్యాంక్‌కు 41 యూనిట్ల రక్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్ మాట్లాడుతూ, తల్లీబిడ్డల ఆరోగ్యంతోనే ఆశాజనక భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలని, అందుకు సరిపడా పోషకాహారం తీసుకుంటూ వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, సెక్రటరీ నవీన్‌కుమార్, ట్రెజరర్ విజయ్‌కుమార్, స్త్రీల వైద్యురాలు జీబీ మాధవి, పిల్లల వైద్యుడు జీ రాంమోహన్, ఫిజీషియన్లు విజయ్ మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రఘురామన్, చైతన్య, శ్రీలత, బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి ఉషా ఖండల్, రవికాంత్, అజయ్ ఖండల్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వైద్యులు